ప్రజాశక్తి

గురువారం 8 మే 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఆదివాసీ పల్లెలు విలవిల

- అదానీ ప్రాజెక్టుతో ఆందోళన
- నీట మునగనున్న వ్యవసాయ భూములు
- జీవనానికి ఏర్పడనున్న ముప్పు
- దాదాపు 47వేల ఎకరాల ఆయకట్టుకు నష్టం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

చుట్టూ ఎత్తైన పచ్చని కొండలు. ఆ కొండల మధ్య వ్యవసాయ పంటలు. పక్క నుంచి నిరంతరం పారే శారద నది ప్రవాహ శబ్దాలతో ప్రశాంత జీవితాలను గడిపే గిరిజన పల్లెలు... అదానీకి చెందిన రైవాడ ఓపెన్ లూప్ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు సృష్టించబోయే విపత్తును తలచుకొని విలవిల్లాడుతున్నాయి. జంతు, ప్రకృతి విపత్తులకు భయపడని గిరిజనులు అదానీ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుకు మిగతా 2లో..

సిఎం దృష్టికి తీసుకెళ్తా

రైవాడ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుతో వచ్చే నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తాను. మాడుగుల నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతం. సరైన సాగునీటి వనరుల్లేక రైతులు ఇబ్బందిపడుతున్నారు. రైవాడపైన ప్రాజెక్టు నిర్మిస్తే ఆయకట్టు దెబ్బతింటుంది. అందుకని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు రాకుండా ప్రయత్నిస్తాను.

బండారు సత్యనారాయణమూర్తి,
మాడుగుల ఎమ్మెల్యే

అనుమతులు రద్దు చేయాలి

అదానీకి ప్రజల సంపదను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టబెడుతున్నాయి. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా అదానీ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వడం దుర్మార్గం. ఈ అనుమతులన్నీ రద్దు చేయాలి. గిరిజనుల జీవితాలకు, మైదాన ప్రాంతంలోని ఆయకట్టుకు సాగునీటి సమస్యలేకుండా చర్యలు తీసుకోవాలి. గిరిజనులు, ఆయకట్టు రైతులకు నష్టం చేసే అదానీ ప్రాజెక్టును ఐక్యపోరాటాలతో అడ్డుకుంటాం.

జి.కోటేశ్వరరావు,
సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి

నగరంలో సివిల్ మాక్‌డ్రిల్

- వన్ టౌన్ రాణీబొమ్మ సెంటర్, క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాలలో రక్షణ విన్యాసాలు
- పర్యవేక్షించిన ఎస్‌డిఆర్‌ఎఫ్ ఐజి, జిల్లా కలెక్టర్, జెసి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం నగరంలో బుధవారం పలుచోట్ల సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించింది. అనుకోని రీతిలో ఉగ్రదాడులు జరిగినా, బాంబులు పేలినా, అగ్ని ప్రమాదాలు వాటిళ్లినా ఎలా వ్యవహరించాలి అనే అంశాలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ రక్షణ దళాలు ప్రదర్శనలు ఇచ్చాయి. బుధవారం సాయంత్రం వన్ టౌన్ పరిధిలోని రాణిబొమ్మ సెంటర్, క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాలలో వేర్వేరుగా నిర్వహించిన ఆపరేషన్లలో సివిల్ డిఫెన్స్, అగ్నిమాపక, ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్, పోలీసు, జివిఎంసి, రెవెన్యూ, సివిల్ సప్లైస్, వైద్య శాఖ, పలువురు వాలంటీర్లు భాగస్వామ్యమయ్యారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ ఐజి రాజకుమారి, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ దగ్గరుండి పర్యవేక్షించారు.

మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న బృందాలు

క్షతగాత్రులను సురక్షితంగా కిందికి దించుతున్న భద్రతా దళాలు

పలు చోట్ల బ్లాక్ అవుట్ డ్రిల్ కార్యక్రమాలు

నగరంలోని వన్ టౌన్ రాణీబొమ్మ సెంటర్, క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాల, విశాఖపట్టణం పోర్ట్ ట్రస్ట్ పరిధిలో బుధవారం మిగతా 2లో..

రామజోగయ్య శాస్త్రికి ఆత్రేయ పురస్కారం

▶ వార్త మెయిన్‌లో..

'శాంతి ఆయిల్ పామ్'లో విద్యుదాఘాతానికి జెసిబి ఆపరేటర్ దుర్మరణం

▶ వార్త 5లో..

అల్లూరికి ఘన నివాళి

▶ వార్త 8లో..

13న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అధ్యక్షతన ఈ నెల 13వ తేదీన జెడ్‌పిస్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సిఇఒ పి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన జెడ్‌పి సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. 2, 5వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 10 గంటలకు, 3, 4 స్థాయీ సంఘ సమావేశాలు 11 గంటలకు, 1,6,7వ స్థాయీ సంఘ సమావేశాలు ఉదయం 12 గంటలకు జరుగుతాయని వివరించారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపిపిలు, సంబంధిత ప్రగతి నివేదికతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

వార్త మెయిన్‌లో..

'గాలి' ఎప్పుడో అరెస్టు కావాలి : సిహెచ్ఎన్ఆర్

పది, ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు జరగబోవు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు, 12 నుంచి 17వ తేదీ వరకు జరగబోవు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖ అధికారులు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించి సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకూ తావు లేకుండా, విజయవంతం చేసేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.

పదో తరగతి పరీక్షలు ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 9-30 నుంచి 12-45 గంటల వరకు జరుగనున్నట్లు తెలిపారు. 3152 మంది రెగ్యులర్, 1411 మంది ప్రైవేట్ విద్యార్థులు కలిపి మొత్తం 4563 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉందని వివరించారు. వీరి కోసం 27 పరీక్ష కేంద్రాలు, 27 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 27 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను, నలుగురు రూట్ ఆఫీసర్లు, మరో నలుగురు అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి క్వశ్చన్ పేపర్స్ ప్రభుత్వ క్వీన్ మేరీ గర్ల్స్ హైస్కూల్ నుంచి సెంటర్లకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్

ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు జరగబోవు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలను ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2-30 నుంచి 5-30 గంటల వరకు రెండవ సంవత్సరం పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 66 సెంటర్లను ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో మొబైల్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని స్పష్టంచేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించి పోలీస్ బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల సమీపంలో 200 మీటర్ల దూరంలో ఉన్న ఫొటో జెరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆదివాసీ పల్లెలు విలవిల

భయపడుతున్నారు. పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుతో తమ వ్యవసాయ పంటలు నీటమునిగితే తమ బతుకులు ఎలా అని ఆందోళన చెందుతున్నారు. పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు వివరాలు బయటకురాకుండా రికార్డు వనంతా ప్రభుత్వం పూర్తిచేయిస్తోంది. నిర్మాణ అనుమతులకు ఆటంకాల్లేకుండా ఏర్పాట్లన్నీ చకచకా జరుగుతున్నాయి. అనంతగిరి, వేపాడ, దేవరాపల్లి మండలాల కొండల మధ్య వ్యవసాయం చేసుకొని బతుకుతున్న చింతలపూడి పంచాయతీ గిరిజనులు సాగుచేసే భూములకు నీటి వనరులు నిలిచిపోవడమే కాదు, అత్యధిక భాగం రిజర్వాయర్ల ఏర్పాటుతో నీటమునిగే అవకాశాలున్నాయి.

రైవాడ జలాశయానికి వచ్చే శారదనదీ పరీవాహక ప్రాంతంలోని నీటి వనరులకు అడ్డంగా రెండు రిజర్వాయర్లను నిర్మిస్తే కిందకు వచ్చే నీటి ప్రవాహాలు ఆగిపోనున్నాయి. దీంతో శారద నదిపై నిర్మించే రైవాడ సహా శారద ఉపనదులపై నిర్మించే పెద్దేరు, కోనాం వంటి నీటిపారుదల ప్రాజెక్టులకు నీటి సమస్య ఏర్పడనుంది. 900 మెగావాట్ల సామర్థ్యం కల్గిన రైవాడ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుతో భవిష్యత్తులో మాడుగుల, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని 145 గ్రామాలకు చెందిన దాదాపు 47వేల ఆయకట్టుకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ నష్టం కలగనుంది. రైవాడ నుంచి విశాఖ నగర ప్రజలకు వచ్చే తాగునీటికి కొరత ఏర్పడనుంది. వేపాడ మండలం మారిక కొండల నుంచి శారదలోకి ప్రవహించే నీటి వాగులు విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్లలో కలిసిపోనున్నాయి. చింతలపూడి పంచాయతీ సమ్మిద పక్క నుంచి శారద ప్రవహిస్తోంది. ఈ నీటి ప్రవాహాలపై రిజర్వాయర్లు నిర్మిస్తే గిరిజనుల రాకపోకలు కష్టమవుతాయి. గతంలో సర్వేను అడ్డుకున్నట్లే ఊరంతా కలిసి ప్రాజెక్టు రాకుండా అడ్డుకుంటామని సమ్మిద గ్రామానికి చెందిన శ్రీను తెలిపాడు. రిజర్వాయర్లు కడితే రహదారుల్లేక వేర్వేరు మార్గాల్లో వెళ్లే అవకాశం పోతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గుమ్మ పంచాయతీకి చెందిన సీదరి కొండబాబు అన్నాడు. ప్రతిపాదిత పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు నాన్ షెడ్యూల్ ఏరియాలో ఉండడంతో ఆ ప్రాంతంలోని అత్యధిక భూములు గిరిజనేతరుల చేతుల్లోవున్నాయి. వీరు పామాయిల్, రియల్ ఎస్టేట్ వెంచర్లు వేస్తున్నారు. అందుకని గిరిజనేతరులను ఒప్పించి వారి భూములు తీసుకొని ప్రాజెక్టు ఏర్పాటుకు ఉన్న ప్రధాన ఆటంకాలను తొలగించుకోవాలని అదానీ ప్రతినిధులు ఎత్తులు వేస్తున్నారు.

నగరంలో సివిల్ మాక్‌డ్రిల్

సాయంత్రం సివిల్ మాక్ నిర్వహించిన రక్షణ బృందాలు అదే రోజు రాత్రి, కొన్నిచోట్ల బ్లాక్ అవుట్ డ్రిల్స్ నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేశాయి. ఉగ్రమూకలు అనుకోని రీతిలో ప్రజలపై దాడులు చేసేందుకు పన్నాగం పన్నిన క్రమంలో రక్షక దళాలు ఎలా స్పందించాలి, ప్రజలు ఏ విధంగా వ్యవహరించాలి అనే కోణంలో వన్‌టౌన్ ప్రాంతంలో, సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో బుధవారం రాత్రి బ్లాక్ అవుట్ నిర్వహించాయి. విద్యుత్ సరఫరా నిలిపివేసి ఉగ్రమూకలు దాడులకు తెగబడితే ఏ విధంగా స్పందించాలో రక్షక దళాలు ప్రజలను అప్రమత్తం చేశాయి.

ప్రతి వార్డు సచివాలయ పరిధిలో మాక్ డ్రిల్ : కలెక్టర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రాబోయే కొద్ది రోజుల్లో నగరంలోని అన్ని వార్డు సచివాలయాల పరిధిలో సివిల్ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తామని, ఉగ్రదాడులపై ప్రజలను అప్రమత్తం చేస్తామని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. వన్ టౌన్ పరిధిలో జరిగిన మాక్ డ్రిల్ సమయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. నిజమైన ఘట్టంలో ఏ విధంగా అధికారిక బృందాలు, వైద్య బృందాలు వ్యవహరిస్తాయో తెలుపుతూ ప్రదర్శనలు ఇస్తున్నామని చెప్పారు. అగ్నిమాపక వాహనాలను, అంబులెన్స్‌లు, ఎమెర్జెన్సీ రెస్పాన్స్ టీములు, ఎమెర్జెన్సీ సహాయక వాహనాలు, తాత్కాలిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని, రక్షణ చర్యల్లో వినియోగించే అన్ని రకాల పరికరాలను ప్రదర్శనలో ఉంచామని కలెక్టర్ వివరించారు. భవిష్యత్తులో అనుకోని ఘటనలు ఏమైనా జరిగినట్లయితే వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉందని మీడియా అడిగిన ప్రశ్నకు జిల్లా కలెక్టర్ సమాధానమిచ్చారు.

పది, ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమీక్ష

ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద అత్యవసర మందులతో పాటు ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షలు రాసే సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా జరగాలని, పోలీసు బందోబస్తు, ఫ్లయింగ్ స్క్వాడ్ విధివిధానాలు, ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాలు తరలింపులు తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలన్నారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు సమయానికి చేరుకునేలా ఆయా రూట్లలో బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు, జివిఎంసి, వైద్య శాఖ, ఆర్‌టిసి, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌జి పాలిమర్స్ బాధితులకు...

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్ లీక్ ప్రమాదం జరిగి 5 ఏళ్ల గడిచినప్పటికీ, నేటికీ ఆర్ఆర్.వెంకటాపురం చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలకు న్యాయం జరగలేదని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆనాడు జరిగిన ఘటనలో మనుషులతో పాటు పశువులు, వన్యప్రాణులు ప్రాణాలు కోల్పోయాయని, అనేక మంది చర్మవ్యాధులతోనూ, ఊపిరితిత్తుల సమస్యలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎల్‌జి పాలిమర్స్ సంస్థకు కేటాయించిన స్థలంలో బాధితులకు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం చేపడతామని నాటి ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికీ అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎల్ జి పాలిమర్స్ ప్రమాదం కారణంగా 5 గ్రామాల ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం పడుతుందని నివేదిక అందజేశాక హాస్పిటల్ నిర్మాణం చేపట్టేంతవరకు స్థానిక ప్రజలకు వైద్యశిబిరాలు ద్వారా ఉచిత వైద్యం అందిస్తామన్న హామీని తుంగలో తొక్కారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎల్‌జి పాలిమర్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు తగిన నష్టపరిహారం కూడా చెల్లించలేదని పేర్కొన్నారు. వారికి ప్రభుత్వం ఉపాధి కల్పించాలన్న డిమాండ్‌ను కూడా పెడచెవిన పెట్టారని తెలిపారు. దక్షిణకొరియా కంపెనీ నిర్లక్ష్య కారణంగా ప్రమాదం జరిగిందని నాడు నివేదికలు తెలుపుతున్నప్పటికీ, నేడు టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వాలు తిరుపతిలో శ్రీసిటీలో భూములు కేటాయించి శంకుస్థాపనలకు పూనుకోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. శ్రీసిటీలో దక్షిణకొరియా సంస్థకు కేటాయించిన భూములను తక్షణమే రద్దుచేయాలని, గోపాలపట్నం ఆర్ఆర్.వెంకటాపురంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం చేపట్టాలని, ఉచిత వైద్యం అందించాలని, కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

మధ్యతరగతి కోసం బడ్జెట్ అపార్ట్‌మెంట్లు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖనగర పరిసర ప్రాంత మధ్య తరగతి ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు నగర పరిధిలో బడ్జెట్ హౌసింగ్ అపార్ట్‌మెంట్లను నిర్మించ తల పెట్టామని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి.ప్రణవగోపాల్, కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ బుధవారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. దీనికి సంబంధించి వినియోగదారుల ఆసక్తి, అవసరాలను తెలుసుకునేందుకు సమగ్ర సర్వేను నిర్వహించదలిచామని పేర్కొన్నారు. ఈ విధంగా సేకరించిన సూచనలు, సలహాలను సమగ్రంగా పరిశీలించి వాటికి అనుగుణంగా అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. దీని కోసం ఒక నియమిత క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్రకటన బోర్డులను నగరంలో జన రద్దీ గల ప్రాంతాల్లో ప్రదర్శిస్తామన్నారు. దీన్ని స్కాన్ చేస్తే వారికి ఒక సర్వే అప్లికేషన్ వస్తుందని, దాన్ని వారు తమ అభిప్రాయం మేరకు నింపి అప్‌లోడ్ చెయ్యాలని కోరారు. సర్వేలో వచ్చిన అభిప్రాయాల ఆధారంగా ఎంఐజి బడ్జెట్ హౌసింగ్ అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి ప్రణాళికలు వేస్తామని తెలిపారు.

ఛీటింగ్ కేసులో రెండేళ్ల జైలు శిక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో నమోదైన చీటింగ్ కేసుకు సంబంధించి ఒక వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ నాలుగో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ మంగళవారం తీర్పును వెలువరించారు. 2022 ఫిబ్రవరి 18న కె.వీరరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొత్స డేనియల్ సునీల్ కుమార్‌పై ఎంవిపి ఎస్ఐ పి.లక్ష్మి ఆధ్వర్యాన కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి కె.వాసుదేవరావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూర్యకుమార్ విచారణ జరిపారు. సంఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... మైనింగ్ వ్యాపారం చేసుకునే కొమ్ము వీరరాజును దక్షిణాఫ్రికా నుంచి దిగుమతి చేసుకున్న మాంగనీసును పోర్టు ద్వారా అందజేస్తానని రూ.11 లక్షలు తీసుకున్నారు. మాంగనీసును ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న సునీల్‌కుమార్‌పై వీరరాజు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. కేసు విచారణ అనంతరం పైవిధంగా న్యాయమూర్తి శిక్ష విధించారు.

పలు ప్రాంతాల్లో మెట్రోపాలిటన్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ బుధవారం నగరంలో క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఎన్ఎడి జంక్షన్లో నిర్మిస్తున్న రైల్ ఓవర్ బ్రిడ్జి పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ పనులను ఈ నెలాఖరుకు పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ మధుసూదన్, ఉపకార్యనిర్వాహక ఇంజినీర్ విశ్వనాథం, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాఖ మార్కెట్‌లోకి ఎఐ ఇంటిగ్రేటెడ్ టీవీలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సామ్‌సంగ్ నూతన ఉత్పత్తి అయిన ప్రీమియం ఎఐ -ఇంటిగ్రేటెడ్ క్యుఎల్ఈడి టీవీలను మంగళవారం విశాఖ మార్కెట్‌లో విడుదలచేశారు. ఈ సందర్భంగా సామ్‌సంగ్ ఇండియా విజువల్ డిస్‌ప్లే బిజినెస్ సీనియర్ డైరెక్టర్ విప్లవ్ డాంగ్ మాట్లాడుతూ, ఈ నూతన శ్రేణి టీవీలు ఆకట్టుకునే విజువల్స్, స్పష్టమైన ధ్వని అందజేస్తాయని తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి అమెజాన్, ఫ్లిప్ కార్ట్, సామ్‌సంగ్.కాంలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ క్యుఎల్ఈడి టీవీలు అద్భుతమైన రంగు ఖచ్చితత్వం, మన్నికను అందించడానికి రియల్, సేఫ్ క్వాంటం డాట్ టెక్నాలజీని కలిగి ఉందని, ఈ టీవీలు కేన్సర్ కారకంగా భావించే కాడ్మియం కలిగి ఉండవని తెలిపారు.

ఘనంగా మీర్ మహమ్మద్ జయంతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కీర్తిశేషులు సయ్యద్ మీర్ మహమ్మద్ జయంతిని బుధవారం కెజిహెచ్ భావనగర్ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రోగులకు కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కుష్టు వ్యాధి నివారణ కేంద్రంలో కుష్టి రోగులకు, పాపా హోమ్ అనాథలకు మధ్యాహ్నం భోజనాన్ని ఏర్పాటు చేసినట్టు మీర్ మహమ్మద్ కుమారులు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఇలియాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సిఎం రమణ, మైలపల్లి శ్రీను, నాయకులు ఎమ్‌డి మానన్, అహ్మద్ అతుల్లా హ యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : కార్మికులంతా తమ హక్కుల కోసం కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. మద్దిపాలెంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులందరికీ ఈశ్రమ కార్డులు ఉండాలని, వాటితో ఆర్థికంగా భరోసా లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కనీస వేతన చట్టం, సమాన పనికి సమాన వేతనం, బాల కార్మిక చట్టం గురించి వివరించారు. డాక్టర్ బి.నాగేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ శారదా దేవి ప్రసంగించారు.

మేయర్‌కు బిసి నాయకుల అభినందనలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావును జివిఎంసి ప్రధాన కార్యాలయంలో శాసనమండలి మాజీ సభ్యులు దువ్వారపు రామారావు ఆధ్వర్యాన బీసీ సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ కులాలకు ఆర్థిక, సంక్షేమం అందించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు.

హనీఫ్ మృతి పట్ల సంతాపం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఆల్ ఇండియా పోర్టు డాక్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు, అఖిల భారత రేవు కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మిక సమాఖ్య కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ పిఎంఎం హనీఫ్ మృతి పట్ల ఫెడరేషన్ అనుబంధ సంస్థ అయిన పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ ఆఫీస్‌లో బుధవారం సంతాప కార్యక్రమం నిర్వహించారు. హనీఫ్ చిత్రపటానికి యూనియన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి డికె.శర్మ, కోశాధికారి మంగయ్య నాయుడు, ట్రస్ట్ బోర్డు మెంబర్ కెవి.ఆంజనేయరావు, సీనియర్ నాయకులు సి హెచ్.శ్రీనివాస్‌ప్రసాద్, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

20న రాష్ట్రవ్యాప్తంగా ఆటోలు సమ్మె

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జాతీయ స్థాయిలో అఖిలపక్ష కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో భాగంగా ఈ నెల 20వ తేదీన ఆటోల సమ్మె నిర్వహించనున్నట్లు ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి తెలిపారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం సరస్వతి పార్క్ వద్ద ఆటో డ్రైవర్లు ప్రచారం చేశారు. కార్యక్రమంలో గొరిసి నాగిరెడ్డి, జి.శ్రీనివాస్, జి.జోగారావు, జి.పెద్దమూర్తి, ఎ.నూకఅప్పారావు, పి.సూరిబాబు, ఎన్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయనగరం 1వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టులో

EP No: 216/2023 in OS No:68/2015

Between:
గొట్టిముక్కల రామరాజు .....DHr
And:
పీలా తేజ .....JDr
To
పీలా తేజ S/o సత్యనారాయణ, R/o D.No:1-97, పెందుర్తి గ్రామం మరియు మండలం, విశాఖపట్నం జిల్లా ....JDr

పై డిక్రీ హోల్డరు డిక్రీ సొమ్ము రాబట్టుకొను నిమిత్తం మీకు చెందిన భూములను వేలం కోరుచూ పై అమలు పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషను మీ హాజరు నిమిత్తం **తే17-06-2025దీ**కి వాయిదా ఉన్నది. ఆ దినమున మీరు ఖుద్దునగాని, వకీలుగారి ద్వారా గాని హాజరు అయి పై అమలు పిటిషన్‌లో అభ్యంతరములు దాఖలు చేసికొనవచ్చును. అట్లు హాజరు కాని యెడల మీ పరోక్షమందు తీర్మానము జరుగునని తెలియజేయడమైనది.

ధవళ వెంకటరావు
న్యాయవాది,
విజయనగరం,
సెల్: 9440194894

వార్డుల అభివృద్ధికి కృషి చేయాలి

జెడ్‌సిలతో సమీక్షలో మాట్లాడుతున్న మేయర్ పీలా

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: జివిఎంసి జోనల్ కమిషనర్లు ప్రతిరోజూ విధిగా ఆయా జోన్లలో పర్యటించి ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించి వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో అందరు జెడ్‌సిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ జోన్లలోని ఖాళీ స్థలాలను గుర్తించి వాటికి పన్నులను విధించి జివిఎంసి ఆర్థిక పరిపుష్టికి చర్యలు చేపట్టాలన్నారు. అనధికార లేఔట్లలో అనుమతుల్లేని కట్టడాలను గుర్తించి వాటిపై తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వార్డులో పారిశుధ్య లోపంపై సహాయ వైద్యాధికారులు పర్యవేక్షించాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని గెడ్డల్లోని పూడికలు వ్యర్థాలు తొలగించాలని, అవసరమైన చోట మరమ్మతులకు ప్రతిపాదనలు చేసి నివేదించాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు.

వార్డు సచివాలయ కార్యదర్శుల పనితీరుపై ప్రజల నుంచి ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వాటిని చక్కబెట్టాలన్నారు. తానునిత్యం ఏదో ఒక వార్డులో పర్యటించి పరిశీలిస్తానన్నారు. ఉద్యోగుల పనితీరులో లోపాలుంటే చక్కదిద్దుకోవాలని, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు.

జస్టిస్ గిరిజా ప్రియదర్శినికి ఘననివాళి

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : తెలంగాణ హైకోర్టు జడ్జిగా విధులు నిర్వహిస్తూ ఈనెల 4న అనారోగ్యంతో మృతి చెందిన జస్టిస్ ఎం.గిరిజ ప్రియదర్శినికి బుధవారం విశాఖపట్నం న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంతాపసభలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎంకె.శ్రీనివాస్ మాట్లాడుతూ జస్టిస్ గిరిజాప్రియదర్శిని విశాఖపట్నం సీనియర్ న్యాయవాది ఎన్‌వి బద్రీనాథ్ వద్ద ఆఫీస్ జూనియర్‌గా జాయిన్నై, ఇక్కడే న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ జిల్లా జడ్జిగా ఎంపికయ్యారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కరీంనగర్, ప్రకాశం విజయనగరం తదితర జిల్లాల్లో ప్రధాన న్యాయమూర్తిగా తన సేవలందిస్తూ ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు జడ్జిగా ఉద్యోగోన్నతి పొందారన్నారు. విశాఖపట్నం న్యాయవాదుల సంఘానికే గర్వకారణమైన జస్టిస్ ఎం.గిరిజ ప్రియదర్శిని అకాల మరణంఉమ్మడి రాష్ట్రానికే కాక ముఖ్యంగా విశాఖపట్నం న్యాయవాదుల సంఘానికి తీరని లోటన్నారు. బార్ కౌన్సిల్ సభ్యులు రామ జోగేశ్వరరావు, బైపా అరుణ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు బివి రామాంజనేయరావు (ఐలు), మహ్మద్ అభయ్యుల్లా, పప్పు అనూరాధ, విజయలక్ష్మి తదితరులు ఆమె సేవలను కొనియాడారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నమ్మ శెట్టి రాజు ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు.

ప్రజా పోరాటాలలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-గాజువాక : ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే పోరాటాల్లో సిపిఐ శ్రేణులు భాగస్వాములు కావాలని ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు పిలుపునిచ్చారు. బుధవారం పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో గాజువాక నియోజకవర్గ పార్టీ మహాసభలో మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్, కాలుష్యం సమస్య పెరిగిపోతున్నా వాటి నియంత్రణకు చర్యల్లేవని ఆరోపించారు. నిరుపేదలకు రెండుసెంట్ల ఇంటిస్థలంలోపాటు ఇళ్ల నిర్మాణాలకు రూ.ఐదు లక్షల సాయం అందించాలన్నారు.సిపిఐ రాష్ట్ర సమితి కంట్రోల్ కమిషన్ సభ్యులు ఎజె.స్టాలిన్, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ జి.జనార్ధనరావు, సిపిఐ నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు,పెదపూడి దుర్గారావు, కె.పోతయ్య, కె.మాధవరావు, ఎల్లేటి శ్రీనివాస్, అప్పారి విష్ణుమూర్తి, సోమేష్ , పోలారావు , పప్పు అప్పారావు, కె. వనజాక్షి , పిల్లా సూర్య పద్మ పాల్గొన్నారు .ఈ సందర్భంగా గాజువాక నియోజక వర్గ సిపిఐ కార్యదర్శిగా కసిరెడ్డి సత్యనారాయణ తో పాటు మరో 15 మంది సమితి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బాధిత కుటుంబాలకు వైసిపి సాయం

ప్రజాశక్తి - సీతమ్మధార : సింహాచలం చందనోత్సవం రోజున గోడకూలిన దుర్ఘటనలో మరణించిన బాధిత కుటుంబ సభ్యులకు వైసిపి తరఫున ఒక్కొక్కరికి రూ.రెండు లక్షల పరిహారం అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి, జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు హెచ్‌బి కాలనీలో మృతులు గుజ్జారి మహాలక్ష్మి, పైలా వెంకటరత్నం కుటుంబాలను పార్టీజిల్లా అధ్యక్షుడు కెకె.రాజు ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ నేతలు పరామర్శించి, ఆర్థికసాయం చెక్కులను అందజేశారు.

ఆర్థిక సాయం చెక్కులను అందజేస్తున్న కెకె.రాజు

కార్యక్రమంలో గొలగాని శ్రీనివాస్, మొల్లి అప్పారావు, సురేష్, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, నడింపల్లి కృష్ణంరాజు, రవి రెడ్డి, అంబటి శైలేష్, మార్కండేయులు, మారుతి ప్రసాద్, మల్లీశ్వరి పాల్గొన్నారు

మధురవాడ : సింహాచలం చందనోత్సవంలో గోడకూలిన దుర్ఘటనలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు వైసిపి సాయం చెక్కులను బుధవారం అందజేశారు. ఈ ఘటనలో మృతి చెందిన చంద్రంపాలెం సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉమామహేశ్వరరావు శైలజ దంపతుల కుటుంబాన్ని వైసిపి జిల్లా అధ్యక్షుడు కెకె.రాజు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్ని శ్రీను తదితరులు పరామర్శించి, బాధిత కుటుంబానికి రూ.రెండు లక్షల చెక్కులను అందజేశారు.

ఉచిత న్యాయ సాయంపై అవగాహన

ప్రజాశక్తి- సీతమ్మధార : న్యాయ సలహా కేంద్రాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అంగన్వాడీలు భాగస్వామ్యం కావాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం ఆర్అండ్‌బి జంక్షన్ దరి ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లకు ఉచిత న్యాయ సలహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. మహిళలు గృహహింస, వేధింపులు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు తీసుకొచ్చే చట్టాలపై అవగాహన కలిగి వాటిని సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. అసంఘటిత రంగ కార్మికుల సామాజిక భద్రతకు కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ యోజనను ప్రారంభించిందని, ఈ పోర్టల్‌ద్వారా అందే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసంఘటిత కార్మికులు ఎవరైనా ఈశ్రమ్ కార్డులకు దరఖాస్తు చేసుకుని పొందాలన్నారు. సిడిపిఒలు ఎం.వి.రమణకుమారి, ఎం.శ్రీలత పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వి. నరేష్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవిశిక్షణా శిబిరాలు

సమావేశంలో మాట్లాడుతున్న శ్యాంప్రసాద్

ప్రజాశక్తి -ములగాడ : బాలల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు ప్రాధాన్యతనివ్వాలని అని మానవ హక్కుల కౌన్సిల్ వ్యవస్థాపక కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞానశిబిరంలో భాగంగా మాట్లాడుతూ, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా, బాలలపై జరిగే హింస మొదలైన సమస్యల పరిష్కారానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, తమ సంస్థ తగిన సహకారం అందిస్తుందన్నారు. ముందుగా లైబ్రేరియన్ అజయ్‌కుమార్ అధ్యక్షతన అల్లూరి వర్ధంతి, రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు మానవ హక్కుల సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.వి. రమణ, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు ఇపిఎస్. భాగ్యలక్ష్మి, వై.అనసూయాదేవి, స్థానిక నాయకులు జగదాంబ, న్యాయవాది జికెవి. రాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ పై అవగాహన

నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో వేసవిజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాఠశాల ఉపాధ్యాయురాలు కళ్యాణి పర్యావరణ పరిరక్షణ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెట్లు నాటడం వాటిని సంరక్షించడం, నీటిని పొదుపు చేయడం వంటి అంశాలపై విద్యార్థులకు విపులంగా వివరించారు.

చీడికాడ: విద్యార్థులు, వయోజనులు న్యూస్ పేపర్లు చదవడం ద్వారా ఎంతో విజ్ఞానం పొందవచ్చునని చీడికాడ శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ జోగేశ్వరి అన్నారు. వేసవి విజ్ఞాన తరగతుల కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె విద్యార్థులకు న్యూస్ పేపర్ చదివించి ముఖ్యమైన విషయాలను తెలియజేశారు

పోలీసుల అదుపులో నకిలీ ఏసిబి అధికారి

ప్రజాశక్తి -మధురవాడ: మధురవాడ ప్రాంతంలో రోజుకో రకమైన నేరఘటనలు స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.తాజాగా ఒక వ్యక్తి ఎసిబి అధికారి అవతారమెత్తి, స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి బెదిరించి, డబ్బులు వసూలుకు యత్నించి పోలీసులకు పట్టుబడ్డాడు. వివరాలివి.

సుధాకర్ అనే వ్యక్తి బుధవారం మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి తాను ఎసిబి సిఐనని రిజిస్ట్రార్‌ను పరిచయం చేసుకున్నాడు. రెండు మూడు రోజుల నుంచి గమనిస్తున్నానని..ఉద్యోగం పేరుతో అవినీతికి పాల్పడుతున్నా రంటూ రిజిస్ట్రార్‌ను బెదిరించాడు. ఎటువంటి కేసు లేకుండా చేసేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు.

అనుమానం వచ్చిన సబ్ రిజిస్ట్రార్, ఎసిబి సిఐఅని ఎలా నమ్మాలని ఎదురు ప్రశ్నించాడు. దీంతో ఎసిబి ఎస్‌పిగా చెప్పుకునే ఒక మహిళతో ఫోన్‌లో మాట్లాడించాడు. ఆ మహిళ సైతం తాను ఎసిబి ఎస్‌పినని బెదిరించడంతో అనుమానం వచ్చిన సబ్‌రిజిస్ట్రార్ చక్రపాణి పిఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి నకిలీ ఎసిబి అధికారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ దుర్మరణం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని వేంపాడు జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకిస్ట్ దుర్మరణం చెందినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. కాకినాడ జిల్లా వలసపాకల గ్రామానికి చెందిన అనుసూరి వెంకట అనిల్ తన స్నేహితుడు పెంకె తేజతో కలిసి బైక్ పై విశాఖపట్నం బయలుదేరారు.నక్కపల్లి మండలం, వేంపాడు జంక్షన్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున డివైడర్ ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైకిస్ట్ అనుసూరి వెంకట అనిల్ తీవ్రంగా గాయపడ్డాడు. తుని ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని, తన స్నేహితుడు పెంకె తేజ స్వల్ప గాయాలతో బయటపడ్డాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ సన్ని బాబు వెల్లడించారు.

వాటర్ బాటిల్ అడిగి.. పుస్తెల తాడు కొట్టేసి..

నాలుగు తులాల బంగారం అపహరణ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : పట్టపగలు మధ్యాహ్నం 12 గంటల సమయంలో టీ దుకాణం వద్దకు స్కూటీపై వచ్చిన యువకులు వాటర్ బాటిల్ కావాలని అడిగితే.. అది తీస్తుండగానే టీ షాప్ యాజమాని మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెలతాడు, మంగళ సూత్రాలు తెంపి స్కూటీపై పరారైన సంఘటన మండల కేంద్రం బుచ్చయ్యపేటలో బుధవారం చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... బుచ్చయ్యపేట చెరుకు కాటా వద్ద గ్రామానికి చెందిన అయితిరెడ్డి లక్ష్మి అనే మహిళ టీ దుకాణం నడుపుకొని జీవిస్తుంది. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో అనకాపల్లి నుండి ఇద్దరు యువకులు స్కూటీపై వచ్చి వాటర్ బాటిల్ కావాలని అడిగారు. బాటిల్ కోసం దిగిన వ్యక్తికి దుకాణదారు లక్ష్మి వాటర్ బాటిల్ ఇస్తుండగా ఆమె మెడలో ఉన్న సుమారు నాలుగు తులాల పుస్తెలతాడు, మంగళసూత్రాలను తెంపి స్కూటీపై వడ్డాది వైపు వేగంగా వెళ్లిపోయారు. దీనిపై బాధితురాలు లక్ష్మి బుచ్చయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టపగలు జనం అధికంగా సంచరించే చెరుకు కాటా వద్ద జరిగిన ఈ ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ మేరకు బుచ్చయ్యపేట నాలుగు రోడ్ల కూడలి, స్థానిక దాబాల వద్ద, దిబ్బిడి గ్రామంలోనూ పలు సీసీ ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. నిందితుల ఆచూకీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

గొలుసు దొంగ అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 6వ తేదీ తెల్లవారుజామున జరిగిన గొలుసు దొంగతనం చేసిన నిందితుడ్ని అరెస్టు చేసినట్లు క్రైమ్ ఎసిపి లక్ష్మణరావు తెలిపారు. ఎంవిపి స్టేషన్ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 6వ తేదీ ఉదయం 5 గంటల సమయంలో తన తల్లి జగదాంబ పూలు కోసేందుకు బయటకు వచ్చిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని 1.5 తులాల బంగారం గొలుసులు లాక్కొని వెళ్లాడని ఎంఎంటిసి కాలనీ ప్రాంతానికి చెందిన ఎస్.ప్రవీణ్‌కుమార్ ఎంవిపి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఇన్‌స్పెక్టర్ వి.చక్రధరరావు నేతృత్వంలో డిఎస్ఐ అప్పలరాజు, ఎఎస్ఐ డి.కిషోర్ బృందంగా ఏర్పడి దర్యాప్తు చేశారని పేర్కొన్నారు. సమీపంలోని సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడు పింక్ కలర్‌షర్ట్ వేసుకొని ద్విచక్ర వాహనంపై దొంగతనానికి పాల్పడ్డాడని నిర్ధారించుకున్నట్లు తెలిపారు. అనంతరం సిటీ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి ప్రయాణాన్ని గమనించి వన్ టౌన్ ప్రాంతానికి చెందిన నెమలి మణికంఠ (30)గా గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. కేసును పోలీసులు 14 గంటల వ్యవధిలోనే సాంకేతికతను ఉపయోగించి ఛేదించడం జరిగిందని లక్ష్మణరావు తెలిపారు. అతని నుంచి 1.5 తులాల బంగారు గొలుసు, పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇతనిపై గతంలో 11 పాత కేసులు ఉన్నాయని, ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్, రౌడీ షీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ కేసు ఛేదించిన శ్రీహరి ప్రసాద్, జగత్, కిరణ్, సాయి, రాజేష్ ,అప్పలరాజు, అగస్టియన్‌లను ఆయన అభినందించారు.

ప్రతిభ చూపిన విద్యార్థినులకు అభినందన

అభినందిస్తున్న ఎంఇఒ శివరాణి

ప్రజాశక్తి- తగరపువలస : ఇటీవల టెన్త్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిట్టివలస జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు మదాబత్తుల వర్షిణి (588 మార్కులు), బొడ్డ వలీవ (578), సిహెచ్ లాస్య (571)లను బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎం.శివరాణి, హెచ్‌ఎం రోజామణి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపాదిత రహదారుల పరిశీలన

నేరెళ్లవలసలో రోడ్ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న గంటా, ప్రణవ్‌గోపాల్

ప్రజాశక్తి -భీమునిపట్నం : విఎంఆర్‌డిఎ ప్రతిపాదించిన బృహత్ ప్రణాళిక రహదారులను స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుతో కలిసి విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి ప్రణవ్‌గోపాల్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక బీచ్ రోడ్డు, దొరతోట జంక్షన్, నేరెళ్లవలస జంక్షన్‌లో ప్రతిపాదిత రోడ్లను పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలో పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా ఏయే రోడ్లు విస్తరించాలి, ఎక్కడెక్కడ ఎలైన్‌మెంట్లను మార్చాలనే అంశాలపై చర్చించారు. పరిశీలనలో విఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ కె రమేష్, ఎస్టేట్ అధికారి దయానిధి, ముఖ్య ప్రణాళిక అధికారిణి శిల్ప, సంబంధిత అధికారులు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

సబ్ పోస్టుమాస్టర్‌కు ప్రథమ బహుమతి

బహుమతి అందుకుంటున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి -భీమునిపట్నం : 2024-25 ఆర్థిక సంవత్సరంలో తపాలా జీవిత బీమా పథకం కింద రాష్ట్రపరిధిలో అత్యధిక పాలసీలు, ప్రీమియం కట్టించిన స్థానిక సబ్ పోస్ట్‌మాస్టర్ బి చంద్రశేఖర్ ప్రథమ బహుమతి అందుకున్నారు. విజయనగరం జిల్లా, భోగాపురం మండలం, సవరవిల్లి వద్ద ఒక ప్రయివేటు హోటల్‌లో జరిగిన ఎపి సర్కిల్ డివిజనల్ హెడ్స్ కాన్ఫరెన్స్, సర్కిల్ ఎక్స్‌లెన్స్ కార్యక్రమంలోవిజయవాడ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె ప్రకాష్ నుంచి చంద్రశేఖర్ బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ను పలువురు అభినందించారు.

పూరిపాక దగ్ధం

ప్రజాశక్తి- పెందుర్తి : జివిఎంసి 95వ వార్డు చీమలాపల్లిలో పూరిపాక దగ్ధమైంది. బాధితుడు నాజర్ తెలిపిన వివరాలివి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు రేగి, తీవ్రం కావడంతో వాటిని గమనించి ఇంట్లోని వాళ్లమంతా బయటకు పరుగులు తీసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించామన్నారు. వారు వచ్చి మంటలను అదుపుచేసే సరికి సర్వం బూడిదైందని, రూ.రెండు లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితుడు ఆవేదన చెందుతున్నాడు. విషయం తెలుసుకున్న టిడిపి నేతలు మామిడి కిరణ్, లాయర్ మహేష్ వచ్చి బాధితుడిని పరామర్శించారు.

కొండవాలులలో... తాగునీటికి కటకట!

ఎస్‌ఆర్ నగర్, బిలాల్ కాలనీ వాసుల గొంతు తడుపుతున్న ఊటకుంట

- నగరం నడిబొడ్డున కొండఊటలపైనే ఆధారం
- వేసవిలో ఊటకుంటలు ఇంకి, రెట్టింపైన కష్టాలు
- మాటలే తప్ప, గొంతు తడపని నేతల హామీలు
- ప్రజల మొర పట్టించుకోని జివిఎంసి అధికారులు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ మహానగరంలో అత్యంత విలాసవంతమైన సీతమ్మధార ప్రాంతం శివారున కొండవాలు ప్రాంతంలో ప్రజలు తాగునీటికి కటకటలాడిపోతున్నారు. సీజన్ ఏదైనా ఇక్కడి జనం గుక్కెడు నీటికి అల్లాడిపోయే పరిస్థితి ఉండగా, వేసవిలో నీటికష్టాలు మరింత తీవ్రం కావడం ఇక్కడ పరిపాటి. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు వంటి పలువురు ప్రముఖులు నివాసముంటున్న ఇదే ప్రాంతం కొండవాలులో జనం దశాబ్దాలు తరబడి తాగునీటికి అల్లాడిపోతున్నా పట్టించుకునే దిక్కులేకపోవడం శోచనీయం.

జివిఎంసి 14వ వార్డు సీతమ్మధార కొండవాలు ప్రాంతం ఎస్‌ఆర్ నగర్, బిలాల్ కాలనీల్లో సుమారు ఐదువందల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. నాలుగు దశాబ్దాలుగా వీరు ఇక్కడే జీవనం సాగిస్తుండగా, ఆయా కాలనీలు ఏర్పాటైన నాటి నుంచి నేటివరకు నీటికష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. దిగువ ప్రాంతంలో దాదాపు సగం ఇళ్లకు వ్యక్తిగత కుళాయిలు సదుపాయం ఉండగా, వాటి ద్వారా అరకొర నీటి సరఫరాతో ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. రోజుకు రెండు మూడు బిందెలు రావడమే గగనమై పోతోందని స్థానికులు వాపోతున్నారు. కొన్ని చోట్ల కుళాయి కనెక్షన్లు అలంకారప్రాయంగానే మిగిలి, ఒట్టిపోయాయని ఆరోపిస్తున్నారు.

సీతమ్మధారలోని కొండవాలు ప్రాంతం

ఇక మిగిలిన కొండవాలు ప్రాంతాలకు నీటి సౌకర్యం లేకపోవడంతో, వారంతా కొండలపై ఉన్న ఊటధారలు, కుంటలపైనే ఆధారపడి ఉన్నారు. ప్రస్తుతం వేసవి సీజన్ కావడంతో మండుటెండల దెబ్బకు ఊటధారలు ఇంకిపోవడంతో కుంటల్లోకి చుక్కచుక్క నీరు మాత్రమే చేరుతోంది. దీంతో ఉదయం పూట మొదటగా వెళ్లిన వారికే తప్ప, వెనకొచ్చినవారికి నీటి కుంటల్లో నీరు దొరకని పరిస్థితి ఉందని రెండు కాలనీ వాసులు ఆవేదన చెందుతున్నారు. దశాబ్దాలుగా ఇదే పరిస్థితి నెలకొని ఉండగా, వీరికి శాశ్వత నీటి సదుపాయం కల్పనకు అటు జివిఎంసిగానీ, నేతలుగానీ ఎటువంటి చర్యలు లేకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల సమయంలో ఓట్లకోసం వచ్చిన నేతల హామీలు నీటిమూటలుగా మిగిలిపోతుండగా, ధర్నాలు, ఆందోళనలు చేసినా సమస్య పరిష్కారంలో అధికారులు పూర్తిగా చొరవ చూపని పరిస్థితి ఉంది.

ఎస్‌ఆర్ నగర్, బిలాల్ కాలనీల్లో నీటి కొరత సమస్యతో ఇక్కడ నివాసితుల ఇంటికి బంధువులు, మిత్రులు రావడం మానేశారు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలను ఇంటి వద్ద చేసుకుందామంటే నీటికటకటతో నిర్వాహకులు ఇబ్బంది పడే పరిస్థితి ఉండగా, అతిథులు కూడా అంతంత మాత్రంగా వచ్చే పరిస్థితి ఉంది. దీంతో నగరంలోని ఇతర ప్రాంతాల్లోని కళ్యాణమండపాల్లో కార్యాలను చేసుకునేందుకు ఈ ప్రాంతాల వాసులు తప్పనిసరిగా తరలిపోయే పరిస్థితి ఉంది. ఇక తాగునీటి కటకటతో చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోయే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు జీవీఎంసీ అధికారులు స్పందించి తమ కాలనీలకు మంచినీరు సదుపాయం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

అరకొర నీటితో అవస్థలు

జివిఎంసి కుళాయిల ద్వారా రెండుమూడు బిందెలకు మించి నీరు రావడం లేదు. ఒక్కోసారి రెండుమూడు రోజులకు ఒకసారి మాత్రమే కుళాయిల్లో నీరు వస్తోంది. నీటికి నానా ఇబ్బందులు పడుతున్నాం.

-కె..సావిత్రి స్థానిక మహిళ

కొండ ఊటలే గతి

జివిఎంసి కుళాయి కనెక్షన్ తీసుకున్నా చుక్క నీరు రాని పరిస్థితి. కొండవాలులో ఊటధారల ద్వారా కుంటల్లోచేరిన నీటితోనే అవసరాలు తీర్చుకుం టున్నాం. అధికారులు స్పందించి నీటి సౌకర్యం కల్పించాలి.

- జ్ఞానేశ్వరి, స్థానిక మహిళ

బంధువులు రావడం మానేశారు

తాగునీటి సమస్యతో చుట్టాలు, బంధువులు మా ఇళ్లకు రావడం మానేశారు. 35ఏళ్లగా ఇక్కడే నివాసముంటున్నాం. అప్పుడు, ఇప్పుడు అదే పరిస్థితి. అధికారులు, నేతలు స్పందించి నీటిసౌకర్యం కల్పించాలి.

-తవిటమ్మ, స్థానిక మహిళ

'ఎల్‌జి పాలిమర్స్' బాధితులకు న్యాయం చేయాలి

ప్రమాద ఘటనకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మృతులకు నివాళి

ప్రజాశక్తి -గోపాలపట్నం : 'ఎల్‌జి పాలిమర్స్' స్టైరీన్ విషవాయువు లీకేజీ ఘటనలో బాధితులకు ఐదేళ్లవుతున్నా నేటికీ పూర్తి న్యాయం జరగకపోవడం బాధాకరమని ఎల్‌జి పాలిమర్స్ బాధితుల సంక్షేమ సంఘం నాయకులు శ్రీనివాసు చంద్రశేఖర్, సత్యారావు, సిపిఎంజిల్లా కమిటీ సభ్యులు బి వెంకటరావు, జోన్ కార్యదర్శి బి జగన్, సిఐటియు జిల్లా కార్యదర్శి యు రాజు, అజంతా పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గోవింద్ ఆక్షేపించారు. బుధవారం ఎల్‌జి పాలీమర్స్ గ్యాస్‌లీకేజ్ ఘటనకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వెంకటాద్రి గార్డెన్ నుండి ఎల్‌జి గేటు వరకు కొవ్వొత్తులు ప్రదర్శన నిర్వహించారు. మృతులకు సంతాపం ప్రకటించారు.

కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళి

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎల్‌జి పాలిమర్స్ గ్యాస్ లీకేజీ బాధితులు అనేకమంది నేటికీ అనేక రుగ్మతలతో బాధపడుతున్నారని, వారిని ఆదుకుంటామన్న ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. బాధిత కుటుంబాలకు పూర్తి వ్యక్తిగత పరిహారం అందజేయాలని, వారికి జీవిత కాల ఆరోగ్యకార్డులు, ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ చేపట్టాలన్నారు. దీనికి సంబంధించి కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి బాధితుడికీ ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని, వ్యక్తిగత నష్టపరిహారం ఎల్‌జి పాలిమర్స్ నుంచి అందేలా బాధ్యత వహించాలన్నారు.

ఎపిఇపిడిసిఎల్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా వనజ

ప్రజాశక్తి- సీతమ్మధార : ఎపిఇపిడిసిఎల్ ప్రాజెక్టు విభాగం డైరెక్టర్‌గా టి.వనజ, ఆపరేషన్ విభాగం డైరెక్టర్‌గా టివి సూర్యప్రకాష్‌లను నియమిస్తూ రాష్ట్ర ఇంధనశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. బుధవారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ప్రాజెక్టు విభాగం డైరెక్టర్‌గా టి.వనజ బాధ్యతలు స్వీకరించారు. ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వనజను సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి అభినందించారు. సంస్థ సిజిఎంలు, ఉద్యోగులు, పలు యూనియన్, ఉద్యోగ సంఘాల నాయకులు వనజను సత్కరించి అభినందించారు.

1984లో ఎపిఎస్‌ఇబి కెటిపిఎస్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా చేరిన వనజ, వివిధ విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హోదాలో 2022లో ఉద్యోగవిరమణ చేశారు. 37 ఏళ్ళపాటు విద్యుత్ సంస్థలలోని అన్ని విభాగాలలో సేవలందించారు. అందులో 17ఏళ్లపాటు జిఎం, సిజిఎం, ఇడి వంటి హోదాల్లో కొనసాగారు. 2024లో ఐదు నెలలు

వనజను అభినందిస్తున్న సిఎండి పృథ్వీతేజ్

ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వనజ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అతి కీలకమైన పదవిలో నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్, చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని రెండు విద్యుత్ పంపిణీ సంస్థల్లో పనిచేసిన అనుభవంతో ఇపిడిసిఎల్‌లో ఈపీడీసీఎల్ లో రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలుకు కృషి చేస్తామన్నారు.

'శాంతి ఆయిల్ పామ్'లో విద్యుదాఘాతానికి జెసిబి ఆపరేటర్ దుర్మరణం

- మృతదేహంతో పరిశ్రమ ఎదుట ఆందోళన
- మృతుని కుటుంబానికి రూ.28 లక్షల పరిహారం ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకారం
- రూ.కోటి పరిహారం ఇవ్వాలని సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-వడ్డాది

బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్టలోని శాంతి ఆయిల్ పామ్ పరిశ్రమలో బుధవారం జెసిబి ఆపరేటర్ పల్లా అప్పన్న (30) విద్యుత్ షాక్‌కు గురై దుర్మరణం చెందారు. దీనికి సంబంధించి బంధువులు తెలిపిన వివరాలు ప్రకారం.... మండలంలోని ఎల్‌బిపి.అగ్రహారం గ్రామానికి చెందిన పల్లా అప్పన్న (30) 14 సంవత్సరాలుగా శాంతి ఆయిల్ పామ్ ప్రైవేటు లిమిటెడ్ (మిట్టల్ పామాయిల్ ఫ్యాక్టరీ) పరిశ్రమలో జెసిబి ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం యథావిధిగా విధులకు హాజరైన అప్పన్న పరిశ్రమలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మృతునికి తల్లి, భార్య రేవతి, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. భార్య రేవతి ప్రస్తుతం గర్భిణి. కుటుంబ పోషణకు పెద్ద దిక్కుగా ఉన్న అప్పన్న మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

కంపెనీ ఎదుట ఆందోళన

పామాయిల్ పరిశ్రమలో విద్యుత్ షాక్‌తో అప్పన్న మృతి చెందడంతో ఫ్యాక్టరీ ఎదుటే అంబులెన్స్‌లో మృతదేహాన్ని ఉంచి బంధువులు, స్థానికులు ఆందోళనకు దిగారు. వీరి ఆందోళనకు సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, నాయకులు ఎస్‌వి.నాయుడు, పి.సాంబశివరావు, ఆర్.దేవుడు నాయుడు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతుని కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాల లోపం వల్లే అప్పన్న మృతి చెందారని పేర్కొన్నారు. అప్పన్న భార్య 8 నెల నెలల గర్భిణిగా ఉందని, రెండేళ్ల కుమారుడు వీరి భవిష్యత్తు దృశ్య యాజమాన్యం కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగినా ఇంత వరకు సంబంధిత అధికారులు ఫ్యాక్టరీని సందర్శించకపోవడం విచారకరమన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళన నేపథ్యంలో చోడవరం సిఐ అప్పలనాయుడు ఆధ్వర్యాన ఇద్దరు ఎస్ఐలు, పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆందోళనకారులకు మద్దతుగా మాట్లాడుతున్న సిఐటియు నేత శ్రీనివాసరావు

రూ.28 లక్షల పరిహారం చెల్లింపునకు అంగీకారం

ఫ్యాక్టరీ ఎదుట బంధువులు, స్థానికుల ఆందోళన నేపథ్యంలో యాజమాన్యం మృతుని కుటుంబానికి రూ.28 లక్షలు పరిహారం ఇచ్చేందుకు అంగీకరించింది. అలాగే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రావాల్సిన బెనిఫిట్స్‌తో పాటు మృతుని భార్యకు ఫ్యాక్టరీ ఉద్యోగం ఇవ్వడానికి అంగీకారం తెలిపింది. అప్పన్న మృతుని ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌లో మృతి చెందినట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలి : సిఐటియు

అనకాపల్లి : మిట్టల్ పామాయిల్ ఫ్యాక్టరీలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన జెసిబి ఆపరేటర్ అప్పన్న కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.లోకనాథం, ఆర్.శంకర్రావు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతుడు అప్పన్నపై భార్య, తల్లిదండ్రులు ఆధారపడి ఉన్నారని, ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఫ్యాక్టరీ యాజమాన్యంపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేసు వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రావణి

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పలు చోరీలకు పాల్పడే దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రావణి వెల్లడించారు. ఈ మేరకు బుధవారం నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. డిఎస్‌పి కథనం ప్రకారం... అనకాపల్లిలో ఈనెల 1వ తేదీన కొండ కొప్పాక గ్రామంలో దొంగతనం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు వచ్చింది. అదే రోజు ఆ గ్రామం నుంచే మరో ఫిర్యాదు రావడంతో ప్రత్యేక పోలీస్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. సిఐ అశోక్ కుమార్, ఎస్సై రవికుమార్ నేతృత్వంలో టీంలు స్థానిక ఇంటిలిజెన్సీ ఆధునిక సాంకేతిక నిఘాల ద్వారా కేసును ఛేదించారు. స్పష్టమైన సమాచారంతో మారేడుపూడి జంక్షన్‌లో నిందితులు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, ఉప్పల సురేష్, కందివలస నరసింహారావు, జనార్దన్, కంకణాల సుభాషిణులను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు దొంగతనాలకు పాల్పడినట్లు వారు అంగీకరించారు. నిందితులు జైల్లో స్నేహంతో ముఠాగా తయారై దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. బంగారం వెండి నగదును కొంతమేరకు రికవరీ చేసినట్లు డిఎస్‌పి వెల్లడించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐ నాగేశ్వరరావు, ఏఎస్ఐ భాస్కరరావు, ఏఎస్ఐ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, కొండయ్య, నారాయణ, నరేంద్ర కుమార్, సతీష్, బి శ్రీనివాసరావు, బుజ్జిలను డిఎస్‌పి అభినందించారు.

రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశం : జెసి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 7 నుండి రేషన్ కార్డులలో మార్పులు చేర్పులకు అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం జాహ్నవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యూఆర్ కోడ్ సహిత కొత్త రేషన్ కార్డుల మంజూరు చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ కార్డుల ఏడు (7) సేవలు, కాల పరిమితి కొరకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. కొత్త బియ్యం కార్డుల జారీ, బియ్యం కార్డులో కుటుంబ సభ్యుని చేర్పు, సభ్యుని తొలగింపు, కార్డు సరెండర్, చిరునామా మార్పు, తప్పు ఆధార్ సంఖ్య సరిచేయుట వంటి సేవలు పొందవచ్చని తెలిపారు. ఈ నెల 7 నుండి బియ్యం కార్డుదారులు తమ కార్డులో తగిన మార్పులు కోసం తమ సమీపంలోని గ్రామ, వార్డ్ సచివాలయాల్లో సంప్రదించాలని కోరారు.

ఘనంగా వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

వేసవి విజ్ఞాన శిబిరంలో మాట్లాడుతున్న అతిథులు

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని గవర్ల అనకాపల్లి గ్రామంలో గల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వేసవి విజ్ఞాన శిబిరాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అనకాపల్లి చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగే ఈ విజ్ఞాన శిబిరాలు ఈనెల 7వ తేదీ నుండి 11వ తేదీ వరకు జరుగుతాయని విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు ఆళ్ల మహేశ్వరరావు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుండి 5 గంటల వరకు క్లాసులు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. పిల్లలకు మెదడుకు మేత, సైన్స్ సంగతులు, మ్యాజిక్స్, డ్రాయింగ్ పోటీలు, సైన్స్ కథలు నేర్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 11న ఆదివారం ముగింపు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఈ విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తోటాడ పంచాయతీ కార్యదర్శి సిహెచ్ శ్రీలక్ష్మి, సుడోకో మాస్టర్ వెంకట్రావు, అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ఆర్గనైజర్ బి.ఉమామహేశ్వరరావు, ఆళ్ల నాగేశ్వరరావు, పి మురళీకృష్ణ, రాపేటి పరమేష్, పి భాగేశ్వరరావు, కె నారాయణ, ఎ రామలక్ష్మి, నెహ్రూ యూత్ క్లబ్, సుందరయ్య విజ్ఞాన కేంద్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

9న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా పెందుర్తి పిఎంశ్రీ గవర్నమెంట్ హైస్కూల్లో ఈనెల 9న 40 కంపెనీలతో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, పిజి వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా రెస్యూమేలు, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు జెరాక్స్‌లతో ఆ రోజు ఉదయం 9 గంటలకు జాబు మేళా జరుగు ప్రదేశానికి హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8106327482 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండలో రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. అలమండ మీదుగా వేచలం నుంచి వారాడ కూడలి వరకు 13 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులకు నాబార్డు ద్వారా రూ.3 కోట్లు మంజూరయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకం కలగ కూడదనే ఉద్దేశంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఎం.అలమండ సినిమా హాలు కూడలి నుంచి హనుమాన్ కూడలి మధ్యలో రోడ్డు దుస్థితిని ఆర్ అండ్ బి ఈఈ ఆర్.విద్యాసాగర్ తదితరులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. రోడ్డుకి ఇరుపక్కల ఉన్న ఇళ్ల యజమానులతో మాట్లాడారు. అనంతరం సచివాలయంలో గ్రామస్తులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతల పాత్రునాయుడు, గొర్లె సన్యాసినాయుడు, కిలపర్తి భాస్కరరావు, పోతల అచ్చియ్యమ్మ, చిటిమిరెడ్డి సూర్యనారాయణ, గొర్లె గోవింద తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లోకనాథం, శంకర్, కోటి, శ్రీరామ్, శ్రీను

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆ సంఘం సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.లోకనాథం, ఆర్.శంకర్రావు, రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, నాయకులు గంటా శ్రీరామ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలను మరింత వేగంగా అమలు చేస్తుందన్నారు. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్స్ కింద మార్చి కార్మికులకు ఎటువంటి హక్కులు లేకుండా చేసిందని విమర్శించారు. లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే సమ్మె హక్కు, కనీస వేతనాలు, పని గంటలు, గ్రాట్యుటీ, పెన్షన్, సంక్షేమ పథకాలు వంటి కనీస హక్కులన్నీ కార్మికవర్గానికి దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్స్‌కి వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాలని పిలుపునిచ్చారు.

సబ్బవరం : ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26,000 ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న జరుగుతున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యాన ఆశా వర్కర్లు స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తికి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఉప్పాడ సత్యవతి, ఆశ యూనియన్ నాయకులు భవాని, దేవి, పార్వతి, రామలక్ష్మి, చంద్రకళ పాల్గొన్నారు.

సబ్బవరం పిహెచ్‌సి వైద్యాధికారికి సమ్మె నోటీసు ఇస్తున్న ఆశాలు

అలాగే స్థానిక దుర్గమాంబ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో కార్మికుల సంఘాల సమావేశం జరిగింది. ఈ మేరకు కార్మిక సంఘాలతో మండల సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, నాయకులు ఉప్పాడ సత్యవతి, గొంతిన అప్పారావు, ఎం.గౌరేష్, వివి రమణమ్మ, కాంతి, గౌరీ పాల్గొన్నారు.

తగరపువలస : ఈ నెల 20న కార్మిక, కర్షక సంఘాల దేశవ్యాప్త సమ్మెకు సహకరించాలని సిఐటియు భీమిలి జోన్ నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, పంపాన సూర్యనారాయణ కోరారు. బుధవారం చిప్పాడ దివీస్ సంస్థ కార్యాలయంలో యాజమాన్య ప్రతినిధిని కలిసి వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో దశమి వేడుకలు

ప్రజాశక్తి అనకాపల్లి రూరల్ : పట్టణంలో శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం సంఘం ఆధ్వర్యంలో వైశాఖ మాస శుద్ధ దశమి వేడుకలు, కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్సవాలు బుధవారం ఆలయంలో ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున అమ్మవారి పల్లకి ఊరేగింపు, తిరువీధి మహోత్సవం చేపట్టారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ వెండి రథంపై అమ్మవారి ఉత్సవ విగ్రహాన్నితో 102 రకాల స్వీట్లుతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు బిళ్ళపాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, శ్రీధరాల సోమరాజు, వుప్పల శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

డెయిరీ ఫామ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పశువైద్యశాలలో తనిఖీలు

ప్రజాశక్తి-కశింకోట : అనకాపల్లి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి రామ్మోహన్ రావు, విశాఖపట్నం డివిజనల్ ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్ బుధవారం స్థానిక పశు వైద్యశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయి పర్యటన నిమిత్తమై కసింకోటలోని ఆళ్ళ శివకుమార్ డెయిరీ ఫామ్‌ని సందర్శించారు. ప్రస్తుతం ఉన్న పశుగ్రాసాల సాగు, సార్టెడ్ సెమెన్ దూడలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కశింకోట పశువైద్యాధికారి డాక్టర్ అల్పాన్సా జార్జి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అనకాపల్లి : పాడి రైతులకు అందించే ఉచిత కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు, రాయితీపై అందించే లింగ నిర్ధారణ వీర్యం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి రామ్మోహన్‌రావు, డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సౌజన్య కోరారు. గాంధీనగరం ఏరియా పశు వైద్యశాలలో బుధవారం కసింకోట మండలం పశు వైద్యులు, సిబ్బంది తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో నిర్మిస్తున్న గోకులం షెడ్లు, పశువులకు నీటి తొట్టెల నిర్మాణంపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : మండలంలోని నీలకంఠాపురం గ్రామంలో నరసయ్య చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను స్థానిక ఎంపీడీవో విజయలక్ష్మి బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి ఉపాధి పనులను చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో వరహాలుబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

అగ్రిగేటర్లకు శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు లోకల్ మార్కెటింగ్ బలోపేతం చేయు నిమిత్తం జిల్లాలో ఉన్న లోకల్ మార్కెటింగ్ అగ్రిగేటర్లకు రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా కేంద్ర కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు అధికారి సిహెచ్ లచ్చన్న మాట్లాడుతూ పండించిన వ్యవసాయ ఉత్పత్తులు వినియోగదారులకు అగ్రిగేటర్ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఇందుకు కావాల్సిన టెక్నికల్ సపోర్టు జిల్లా మార్కెటింగ్ టీం అందిస్తుందని చెప్పారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, మండల సమైక్య జిల్లా సమైక్య కేంద్రాలలోనూ, వివిధ రకాలైన అపార్ట్మెంట్లోనూ ఈ మార్కెటింగ్ అగ్రిగేటర్ల ద్వారా కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులకు మధ్యవర్తులుగా రైతు సాధికారత సిబ్బంది ఉంటుందని డిపిఎం వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ గోవింద్, జిల్లా మార్కెటింగ్ అధికారి వర్మ, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్స్ అప్పలరాజు, శివ, వాసు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-కె.కోటపాడు : శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం మండల కేంద్రం కే కోటపాడులో బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసరావు ఉదయం నుండి అభిషేకాలు తమలపాకుల పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. కే.కోటపాడు మెరక రామచంద్రపురం గ్రామాలకు చెందిన మహిళల కోలాటం అందరినీ అలరించింది. అభయాంజనేయ భవన నిర్మాణ కార్మికుల సంఘం సభ్యులు. సంఘం అధ్యక్షుడు బత్తి లక్ష్మణ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ వార్షికోత్సవం ఘనంగా జరిగింది.

కోలాటం ఆడుతున్న మహిళలు

రాష్ట్రాన్ని విద్యా ప్రయోగశాలగా మార్చొద్దు

- పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై 12న ధర్నా

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు మురళీమోహన్, కిశోర్, రాము

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విద్యా ప్రయోగశాలగా మార్చొద్దని ఎపి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శులు సుర్ల మురళీమోహన్, కిషోర్, డి.రాము ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన యుటిఎఫ్ శిక్షణా తరగతుల్లో వారు మాట్లాడుతూ పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో అసంబద్ధతను వ్యతిరేకిస్తూ ఈ నెల 12న జిల్లాస్థాయిలో ధర్నా చేస్తున్నామని, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం ఆరు రకాల పాఠశాలలుగా విభజిస్తే, ప్రస్తుత ప్రభుత్వం వాటిని తొమ్మిది రకాల పాఠశాలలుగా విభజించి ప్రజలను గందరగోళ పరిస్థితుల్లోకి నెట్టివేస్తున్నారని తెలిపారు. జీవో 117ను రద్దు చేశామని చెబుతూనే, ఆ జీవోలో ఉన్న ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిని కొనసాగించడం తగదని పేర్కొన్నారు. హైస్కూల్లో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:40గా, ప్రాథమిక పాఠశాలలో 1:20గా ఉండాలని సూచించారు. యుపి పాఠశాలలను ఎత్తి వేయడం వలన పల్లె ప్రజలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని, వాటిని కొనసాగించాలని కోరారు. 40 మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలలుగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు 12వ వేతన సవరణ కమిషన్ వేసి, 30శాతం మధ్యంతర భృతి ప్రతించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్, గౌరవాధ్యక్షులు పంపనబోయిన వెంకట్రావ్, సహాధ్యక్షులు రొంగళి అక్కునాయుడు, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు గుత్తుల సూర్యప్రకాష్, పొలిమేర చంద్రరావు, శేషుకుమార్, మాకిరెడ్డి రాజునాయుడు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.వి.అప్పారావు, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్

10వ రోజుకు సిహెచ్ఒల సమ్మె

సిహెచ్ఒ అకారంలో కూర్చొని నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-అనకాపల్లి

వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ ఆయుష్మాన్ ఆరోగ్య మిషన్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సిహెచ్ఒ)ల సమస్యలపై చేపట్టిన సమ్మె 10వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా బుధవారం అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్‌లోని నిరసన శిబిరంలో సిహెచ్ఓ అక్షర క్రమంలో కూర్చుని వినూత్నంగా నిరసన తెలిపారు. గత నెల 28వ తేదీ నుంచి సమ్మె చేస్తున్న సిహెచ్ఒలు ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఆరు సంవత్సరాలు దాటిన సిహెచ్ఓలను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని, ప్రతి సంవత్సరం 5శాతం ఇంక్రిమెంట్, పని ఆధారిత ప్రోత్సాహకాలు, ఈపీఎఫ్ఓ పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కార్యక్రమంలో ఏపీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వివి.శ్రీనివాసరావు, జిల్లాలోని 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిహెచ్ఒలు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా 10వ రోజైన బుధవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యోగా చేస్తూ వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రజ మీడియాతో మాట్లాడుతూ, పిఎఫ్ కటింగ్ రెండేళ్లుగా నిలిపివేశారని, పాత పద్ధతిలో పిఎఫ్ కట్ చేయాలని కోరారు. క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి సిహెచ్ఒలను మినహాయింపునివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా నాయకులు మోజెస్, జస్వంత్, సునీత, భవాని, స్వాతి, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

డి.పట్టా భూముల్లో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండలం ఆర్.భీమవరం రెవెన్యూ పరిధిలోని డి.పట్టా భూముల్లో ఆక్రమణలను రెవెన్యూ సిబ్బంది మంగళవారం తొలగించారు. ఆర్.భీమవరం రెవెన్యూ పరిధిలో కడియాల రాజేశ్వరరావు అనే వ్యక్తి 30.74 ఎకరాలను జిరాయితీ భూములుగా భావించి గతంలో కొనుగోలు చేశారు. అయితే ఈ భూములు డి.పట్టా భూములుగా రికార్డుల్లో ఉండడంతో సదరు రాజేశ్వరరావు తను కొనుగోలు చేసిన భూమిని ప్రభుత్వానికి స్వాధీనం చేస్తూ వాటి రికార్డులను జిల్లా కలెక్టర్‌కు గతంలో అందజేశారు. దీంతో పూర్వం డి-ఫారం పట్టాలు పొందిన ఆరుగురు పట్టాదారులకు తహశీల్దార్ 15 రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. డి.పట్టాదారులు నిబంధనలు ఉల్లంఘించడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ ఎం.లక్ష్మి 30.74 ఎకరాల భూములకు సంబంధించిన డి.పట్టాలను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో కొంతమంది అధికార పార్టీ నాయకులు రాత్రికి రాత్రే ఈ భూముల్లో పాకలు నిర్మించారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు స్థానిక వీఆర్వో, వీఆర్ఏలు మంగళవారం అక్రమంగా నిర్మించిన పాకలను తొలగించి ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ భూముల్లో ఎవరైనా అక్రమంగా ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

కుట్టు శిక్షణలో అవినీతిపై విచారణ జరపాలి

ప్రజాశక్తి-మునగపాక : రాష్ట్రంలో కుట్టు మిషన్ శిక్షణలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని వైసిపి ఎలమంచిలి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు బొడ్డెడ చెల్లయ్య నాయుడు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పిల్లి అప్పారావు డిమాండ్ చేశారు. మునగపాకలోని మాజీ ఎమ్మెల్యే కన్నబాబురాజు క్యాంపు కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ మహిళలకు కుట్టు శిక్షణ పేరిట కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేస్తుందని ఆరోపించారు. సూపర్ సిక్స్, ఎన్నికల్లో ఇచ్చిన ఇతర హామీలను అమలు చేయకుండా జనాన్ని మోసం చేస్తుందన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏవో ప్రసాద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, ఎంపిటీసీలు బోడకుర్తి గణేష్, బొడ్డెడ బుజ్జి, గణపర్తి సర్పంచ్ చదరం నాయుడు, బొడ్డెడ లిల్లీ పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు సంస్కృతి విద్యార్థి

ప్రజాశక్తి-పరవాడ : బీహార్ రాష్ట్రం పాట్నాలో ఈ నెల 10 నుండి 17వ తేదీ వరకు జరుగు ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు పరవాడ సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థి ఎన్ఎమ్.హరిన్ ఎంపికయ్యాడు. ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి యూత్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో మంచి ప్రతిభా కనబర్చిన హరిన్ ఐదవ స్థానంలో నిలవగా, ప్రతిభ ఆధారంగా సూపర్ హెవీ విభాగంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఎంపికైనట్లు కోచ్ పూజారి అమర్నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా హరిన్‌కు స్కూల్ ఛైర్మన్ పి. సూర్యనారాయణ రెడ్డి, సీఈఓ కె.నిశాంత్, ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి, కోచ్ అన్నపూర్ణ అభినందనలు తెలిపారు.

మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త ముకుందరావు

మేలు రకం వంగడాలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : రైతులు మేలు రకమైన వంగడాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ ముకుందరావు అన్నారు. గ్రామీణ పని అవగాహన అనుభవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పి.భీమవరం గ్రామంలో, కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం రైతు సదస్సు నిర్వహించారు . ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సిహెచ్ ముకుందరావు మాట్లాడారు. కార్యక్రమంలో డీన్ కే.యోష, కోఆర్డినేటర్ రాజకుమార్, స్థానిక సర్పంచ్ పినపోలు రామునాయుడు, పాల సంఘం కార్యదర్శి పినపోలు రామదాసు పాల్గొన్నారు.

పి4 సర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : గ్రామాల్లో పి-4 సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో వి.విజయలక్ష్మి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్వే ద్వారా కుటుంబాల ఆర్థిక పరిస్థితి, సామాజిక స్థితి, అవసరాలను అంచనా వేయాలన్నారు. గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఈఓపిఆర్డీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పి4 సర్వేపై ఎమ్మెల్యే సమీక్ష

అచ్యుతాపురం : యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ బుధవారం అచ్యుతాపురంలోని తన నివాసంలో ప్రభుత్వ ప్రైవేటు సిబ్బందితో పి4 సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం ప్రజలను గుర్తించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వం ఆశయంగా పనిచేస్తుందని తెలిపారు. సర్వే సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

9న విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : 132/33కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా తుమ్మపాల సెక్షన్ పరిధిలోని తుమ్మపాల, అల్లికానుడి పాలెం సబ్ స్టేషన్స్ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఈనెల 9 ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కసింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 24 గంటల వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

డిఇఒకు ఎఐఎస్ఎఫ్ వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాఠశాలలను నడుపుతూ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి జి.అప్పారావు నాయుడుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.బాబ్జి, జి. ఫణీంద్ర కుమార్, రాజు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి: సాగు భూములకు పరిహారం చెల్లించాలని మండలంలోని బుచ్చిరాజుపేట గ్రామానికి చెందిన సాగుదారుల వారసులు ఎలమంచిలి సత్తిబాబు, శ్రీను, రమణ, కన్నారావు తదితరులుకోరారు. నక్కపల్లిలో బుధవారం వారు మాట్లాడుతూ, బుచ్చిరాజుపేట రెవెన్యూ పరిధిలో ఎలమంచిలి అప్పారావు, ఎలమంచిలి పెద వెంకట రమణలకు సర్వే నెంబర్ 242/2 లో 2 ఎకరాలు చొప్పున, ఇరువురికి కలిసి 4 ఎకరాలు 1960 సంవత్సరంలో ఇవ్వడం జరిగిందని, అప్పటి అధికారులు ప్రొసీడింగ్ కూడా ఇచ్చారన్నారు. దీంతోపాటు మరో 8 ఎకరాలు భూమి సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని వారసులు తెలియజేశారు. ఈ భూమిలో సరుగుడు, యూకలిప్టస్ తోటలు వేయడం జరిగిందన్నారు. అడంగల్ లో కూడా ఎలమంచిలి అప్పారావు, ఎలమంచిలి పెద వెంకటరమణ పేరిట విస్తీర్ణం నమోదయి ఉందన్నారు. వైజాగ్ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం ఏపీఐఐసీ అధికారులు తమ సాగు భూములను సేకరించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఆ భూములకు సంబంధించి ఎటువంటి పరిహారం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, స్థానిక తహసిల్దార్కు అనేక పర్యాయాలు పరిహారం చెల్లించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. పరిహారం చెల్లించకుండా తమ భూముల్లో పరిశ్రమ స్థాపన కోసం రోడ్డు పనులు చేపడుతున్నారని, ఎలా చేస్తారని ప్రశ్నించారు. తామంతా నిరుపేదలమని, సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమ జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకుని తమ భూములకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాగుదారులు బాబూరావు, అప్పారావు, రాముకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాగుదారుల వారసులు

మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్న

ఆపరేషన్ సిందూర్కు మద్దతు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్కు మద్దతు గా నర్సీపట్నంలో బుధవారం ఎన్టీఆర్ స్టేడియం మహాత్మా గాంధీ విగ్రహం వద్ద స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహం ఎదుట భారత సైన్యానికి సంపూర్ణ మద్దతుగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్పీకర్ మాట్లాడుతూ, పహల్గామ్ లో పర్యాటకులపై జరిగిన దారుణ కాల్పులలో 26 మంది అమాయకుల ప్రాణాలు తీసిన ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. అలాంటి దుర్మార్గులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారికి తగిన శాస్తి తప్పదని స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల వారు మద్దతుగా నిలవాలని స్పీకర్ కోరారు.ఈ కార్యక్రమంలో నర్సీపట్నం వార్డ్ కౌన్సిలర్లు చింతకాయల పద్మావతి, ధనిమిరెడ్డి మధు, డబ్బీరు శ్రీకాంత్ వార్డ్ ఇన్చార్జిలు నాగేంద్ర రాజు, చింటూ, నేరెళ్ల రాజేష్, మార్కెట్ రాజా, మహిళలు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఆయన సతీమణి పద్మావతి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా మంగళవారం, బుధవారం కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయని, 8వ తేదీ గురువారం తెల్లవారుజామున 5 గంటల నుండి అయ్యప్ప స్వామివారికి విశేష పూజలు జరుగుతున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుండి స్టేడియంలో భారీ అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్కు సమ్మె నోటీసు

ప్రజాశక్తి -నర్సీపట్నం: ఈనెల 20న సమ్మె నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్కి సమ్మె నోటీసు సీఐటీయూ నాయకులు బుధవారం అందించారు. ఏపి మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యునియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరిగే ఈ సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు విజ్ఞప్తి చేసారు. జనాభాకు తగిన పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని, మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, యూనియన్ నాయకులు బొర్రా శ్రీను, వాసుపల్లి రమణ, కుపరాల హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు ఇస్తున్న సిఐటియు నేతలు

ఉపాధి హామీ పనులపై సమీక్ష

ప్రజాశక్తి -నక్కపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.సీతారామరాజు బుధవారం ఉపాధి పనులపై ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఫారం పాండ్స్, డైలీ వేజ్, హౌసింగ్ మేన్ డేస్ తదితర అంశాలపై చర్చించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ఉపాధి పనులు చేపట్టే ప్రాంతంలో తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉపాధి శ్రామికులు ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉదయాన్నే పనులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ భాగ్యలత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడివో సీతారామరాజు

రూ.9.80 కోట్లతో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సు నిర్మాణం

అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-దంబ్రిగుడ: జిల్లాలో రూ.9.80 కోట్ల వ్యయంతో ఐదు ఎకరాల్లో 36 యూనిట్లతో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులు నిర్మిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ చెప్పారు. బుధవారం మండలంలోని అరకు సంతబయలు వద్ద ఐదు ఎకరాల్లో నిర్మిస్తున్న ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ఎఫ్ఎన్సిలు ఏర్పాటుతో గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ లో అరకు బ్రాండ్ పేరున కాఫీ, మిరియాలు, పసుపు, చిరుధాన్యాలు, ఇతర గిరిజన ఉత్పత్తులను ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎం ఎస్ ఎం ఇలను ప్రోత్సహిస్తామన్నారు. రూ 500 కోట్లతో పరిశ్రమల పార్కులు ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు. ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర మాట్లాడుతూ, కుటీర పరిశ్రమల ఏర్పాటుతో గిరిజన యువతకు ఆర్థిక పురోగతికి దోహద పడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజక వర్గంలో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తోందన్నారు. గిరిజన యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అరకు సర్పంచ్ శారదా సాగర్, స్థానిక నేతలు సుబ్బారావు, ఎంపిడి ఓ ప్రేమసాగర్, ఎపిఐఐసి అధికారులు పాల్గొన్నారు.

పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు

ఆధార్ కేంద్రాల్లో సర్వర్ల మొరాయింపు

ప్రజాశక్తి -కోటవురట్ల: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇబ్బందులకు కలగకుండా అధికారులు ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల్లో సర్వర్లు మొరాయిస్తున్నాయి. దీంతో ఆధార్ నమోదుకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. బుధవారం అన్నవరం, చౌడువాడ గ్రామాలలో సచివాలయాల వద్ద ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు నమోదు కాకపోవడంతో చిన్నారులతో వచ్చిన వచ్చిన ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మండలం నుంచి కాకుండా వివిధ మండలాల నుంచి పలువురు తరలివచ్చారు. వీరికి నిరాశ ఎదురవుతోంది.

తనిఖీలు చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీలు

ప్రజాశక్తి -కొత్తకోట: మోటార్ వాహనాల ఈ చలనా బకాయిలు వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. బుధవారం సాయంత్రం కొత్తకోట పోలీస్ స్టేషన్ సమీపంలో రాకపోకలు సాగించే మోటార్ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంబంధిత వాహనాల ఈ చలనా బకాయిలను గుర్తించారు. వీరి నుంచి మొబైల్ యాప్, మీసేవ కేంద్రాలలో బకాయిలును చెల్లింపులకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపడం, ఇన్సూరెన్స్, వాహన కాలుష్య ధ్రువీకరణ పత్రాలు లేకపోవడం నేరమన్నారు. వాహనదారులు అన్ని రకాల రికార్డులతో వాహనాలు నడపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్సై అప్పారావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లిలో పూజలు చేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

ఘనంగా వాసవి మాత జయంతి

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి లో ఆర్యవైశ్య కులదేవత వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను బుధవారం ఆర్యవైశ్య సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణ మండపంలో అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కక్కిరాల సురేష్, కార్యదర్శి సందీప్, గౌరవ అధ్యక్షులు మామిడి తాతాజీ, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రావికమతం: మండల కేంద్రంలో వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య వర్ధక సంఘం, యూత్ ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి ఆలయంలోప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవి కన్యకామరమేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధులలో ఊరేగించారు.

అప్పలరాజు మృతికి సంతాపం

ప్రజాశక్తి - విశాఖపట్నం : మోటార్ ట్రాన్స్ పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా కార్యదర్శి జి.అప్పలరాజు మృతి పట్ల సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. అప్పలరాజు పెందుర్తి ప్రాంతంలో సిపిఎం, సిఐటియు బలోపేతానికి ఎనలేని కృషి చేసారన్నారు.

కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ 'క్షమత' టీచర్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: కోటక్ మహీంద్రా ఆధ్వర్యంలో కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ 'క్షమత' టీచర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైందని, దీంతో పాటు వన్ కెఈఎఫ్ యాప్ ఆవిష్కరించారని కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సిఈఓ డాక్టర్ గణేష్‌రాజా తెలిపారు. స్థానిక హోటల్లో మీడియాతో మాట్లాడారు. ఇది కోటక్ మహీంద్రా గ్రూప్‌నకు చెందిన సిఎస్ఆర్ అమలు సంస్థ అన్నారు. కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ టీచర్ సామర్థ్యవద్ధి కార్యక్రమమైన 'క్షమత'. ఉపాధ్యాయులు, పాఠశాల నాయకుల కోసం, వన్ కెఈఎఫ్ యాప్‌ను అండ్రాయిడ్ ఫోన్ల కోసం విడుదల చేసిందని,ఇది డిజిటల్ విద్యను అందరికి చేరువ చేసే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా చెప్పవచ్చు అన్నారు. క్షమత ఎపిలో 186 సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాలలు,108 మహాత్మా జ్యోతిబాపులే ఆంధ్రప్రదేశ్ బ్యాక్వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ పాఠశాలల్లో అమలులోకి వస్తోందన్నారు.

మాట్లాడుతున్న రాజారెడ్డి

విశాఖ వాసులకు సరికొత్త ఆకర్షణ సిద్ధం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: విశాఖ వాసులను, నగరానికి వచ్చే పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే మరొక ప్రత్యేక ఆకర్షణ సిద్ధమైంది. బీచ్ రోడ్‌లో పోలీస్‌మెస్ వెనుక భాగంలో సువిశాలమైన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైజాగ్ ఎక్స్‌పోలో నయాగరా జలపాతం నమూనా ప్రజలను అలరించడానికి సిద్ధమైంది. బుధవారం దీనిని నిర్వాహకులు ప్రారంభించారు. 30 అడుగుల ఎత్తు, 181 అడుగుల వెడల్పు కడిగిన నయాగరా జలపాతం నమూనాను ఎగ్జిబిషన్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. పైనుంచి వేగంగా పడుతున్న నేటి ప్రవాహం రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో ఎంతగానో ఆకర్షిస్తోంది. వేసవి నేపథ్యంలో విశాఖ వాసులను, నగరానికి వచ్చే పర్యాటకులను, ముఖ్యంగా చిన్నారులను మరింత అలరించే విధంగా దీనిని ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు నిర్వాహకులు రాజారెడ్డి తెలిపారు. ఇప్పటికే జలకన్యలతో విశాఖలో చిన్నారులను ఎంతగానో ఆకట్టుకున్న ఈ వైజాగ్ ఎక్స్‌పోలో వేసవి దష్ట్యా సరికొత్త ఆకర్షణలతో నగరవాసులకు ఆహ్వానం పలుకుతోంది. టికెట్ రుసుము రూ.150 నుంచి కేవలం రూ.100కే పరిమితం చేసినట్లు తెలిపారు. ఎక్కువ శాతం మంది విశాఖవాసులు వీటిని వీక్షించడానికి వీలుగా ప్రవేశరుసుములో రాయితీ కల్పిస్తున్నారు. వైజాగ్ ఎక్స్‌పో ప్రవేశ రుసుము, జలకన్యలు, కాశ్మీర్ సిటీ, నయాగరా జలపాతం అన్ని వీక్షించడానికి కేవలం రూ.100 మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. ప్రజలందరికి సంతోషాన్ని, ఆనందాన్ని అందించే ఒక ప్రత్యేక ప్రాంగణంగా దీనిని తీర్చిదిద్దనట్లు చెప్పారు. చిన్నారులను ఎంతగానో ఆకట్టుకునే విభిన్న రైడ్లు, మహిళలకు సైతం ఆకర్షించే వస్త్ర ఆభరణాల స్టాల్స్ కుటుంబ సమేతంగా సంతోషాన్ని పంచుకునే వేదికగా రుచికరమైన వంటకాలతో విశాఖ ఎక్స్ పో నగరవాసులను సాదరంగా ఆహ్వానం పలుకుతోంది.

అల్లూరికి ఘన నివాళి

-వాడవాడలా వర్ధంతి వేడుకలు

నక్కపల్లిలో నివాళి అర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- నక్కపల్లి: స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవ వీరులు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా బుధవారం నక్కపల్లిలో సిఐటియు కార్యాలయం వద్ద ఆయన చిత్ర పటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.ప్రసాద్, వై.అప్పారావు, వై.సత్తిబాబు, ఎస్.శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: నర్సీపట్నం ఆర్డిఓ కార్యాలయ ఆవరణలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నర్సీపట్నం డివిజన్ సీనియర్ నాయకులు చిట్టియ్య మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు స్ఫూర్తి తో ప్రజా సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రాజు, భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ శ్రీను, రమణ, అల్లూరి అభిమాని ముజాబ్ పాల్గొన్నారు.

నర్సీపట్నంటౌన్: అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉన్న అల్లూరి విగ్రహానికి ఆర్డిఓ వివి రమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనకాపల్లిడెస్క్: యస్ రాయవరం మండలం ధర్మవరంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అప్పలరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బాలరాజు, వెంకటరమణ వరహాలు, బాబూరావు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్: ఉద్యమాలకు స్ఫూర్తి అల్లూరి సీతారామరాజు అని ఉమ్మడి విశాఖ జిల్లా విశ్రాంత అదనపు ఎస్పీ, అల్లూరి చరిత్ర విశ్లేషకులు కరణం సత్యనారాయణ, అల్లూరి యువజన సంఘం జాతీయ కార్యదర్శి పల్లా భాస్కరమని అన్నారు. గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో సీతారామరాజు ,గంటందొర, సమాధులకు , విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకా సత్యనారాయణ, అల్లూరి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అంబటి వరహాలు రాజు పాల్గొన్నారు.

సిఐటియు, జెవివి ఆధ్వర్యాన వర్ధంతి సభలు

ప్రజాశక్తి-పరవాడ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పరవాడ సంత బయలు వద్ద అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గనిశెట్టి సత్యనారాయణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో నేటి యువత విద్యా, వైద్యం, ఉపాధి, ఇతర ప్రజా సమస్యలపై పోరాడాలని కోరారు. సిఐటియు నాయకులు వీర్రాజు, లక్ష్మి, రమణమ్మ, రాజు పాల్గొన్నారు.

మునగపాక : మండలంలోని వెంకటాపురం గ్రామంలో బుధవారం అల్లూరి చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిఐటియు నాయకులు కడియం సూరి గోవిందరావు, బలిరెడ్డి శ్రీనివాసరావు, సుందరపు మురళి రావు, సుందరపు సత్యనారాయణ, చిన్ని రాంబాబు, గొర్లి అర్జున, ఎస్ బ్రహ్మాజీ పాల్గొన్నారు.

రాంబిల్లి : మండల కేంద్రంలోని అల్లూరి విగ్రహానికి అల్లూరి సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడునాయుడు మాట్లాడారు. అల్లూరి సంఘం నాయకులు భూపతి అప్పారావు, సిహెచ్ గంగరాజు, వై రాము, జి తాతారావు, ధోని కాసియా, కృష్ణ, రాజు, ముఠా కార్మికులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని మోసయ్యపేటలో అల్లూరి విగ్రహానికి జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు మారిశెట్టి వెంకట అప్పారావు పూలమాలవేసి నివాళులర్పించారు. అల్లూరి జీవిత చరిత్రను పోరాటాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కన్వీనర్ కే.సోమనాయుడు పాల్గొన్నారు.

అల్లూరి చిరస్మరణీయుడు : కలెక్టర్

అనకాపల్లి : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ కొనియాడారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి, అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెసి ఎం.జాహ్నవి, డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కెఆర్ఆర్సి సుబ్బలక్ష్మి, సిపిఓ బి.రామారావు, డిఎల్‌డిఓ మంజులావాణి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి నాగ శిరీష, ఇన్చార్జి ఏవో వాసు నాయుడు, సెక్షన్ సూపరిండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలతో అల్లూరికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, గఫూర్, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు. అబ్దుల్ కలాం సేవా సంస్థ ఆధ్వర్యంలో అల్లూరికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆళ్ల ప్రవీణ్ కుమార్ కోరిబిల్లి పరమేష్ పాల్గొన్నారు.

నర్సీపట్నంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

అనకాపల్లి రూరల్ : స్థానిక రైల్వే స్టేషన్ జంక్షన్‌లోని అల్లూరి విగ్రహానికి ఎపి గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పోలవరపు త్రినాథ్, సబ్బవరపు గణేష్, పెనుమత్స రాజు, పొలిమేర ఆనంద్ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం గ్రామంలో అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మరిశా సతీష్, మరిసా నరేష్, నాగప్పారావు, సత్యారావు, కోట సత్యనారాయణ, మలిరెడ్డి బాబ్జి, నాగలపల్లి లెనిన్ బాబు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి విగ్రహానికి జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్ హనుమంతరావు, ఇఒపిఆర్‌డి కె రమేష్ నాయుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లిలో నివాళి అర్పిస్తున్న కలెక్టర్

జివిఎంసి మూడో వార్డు బీచ్ రోడ్డు శాఖా గ్రంథాలయం ఎదురుగా టిడిపి మూడో వార్డు కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు సిహెచ్ రమణ, కె.నాగరాజు, ఎం సంజీవ్‌కుమార్, కొక్కిరి అప్పన్న పాల్గొన్నారు

చిట్టివలస సిఐటియు కార్యాలయం వద్ద అల్లూరి చిత్ర పటానికి జోన్ ఉపాధ్యక్షులు ఎస్ అప్పలనాయుడు, నాయకులు పంపాన సూర్య నారాయణ, దామోదర బాబాజీ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీతమ్మధార : అక్కయ్యపాలెం ఆర్‌కె.నగర్‌లో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అల్లూరికి ఘనంగా నివాళులు అర్పించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, సంతోష్, నాయకులు జ్యోతి, పైడిరాజు, రమణ పాల్గొన్నారు.

ఆనందపురం : మండలం వెల్లంకి గ్రామంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారుదళిత నాయకుడు ఉప్పాడ అప్పారావు, దంతులూరి సుధాకర్ వర్మ, పిల్లా విజయ, పి.వి.వి.ప్రసాదరావు పట్నాయక్, మీసాల రాము నాయుడు, మాధ బత్తుల బుజ్జి, వెంకటరత్నం, పోతిన జీవన సంతోష్, బంక సీతంనాయుడు, పాండ్రంకి గోవింద పాల్గొన్నారు.

పెందుర్తి : సుజాతనగర్ సిపిఐ కార్యాలయం, భగత్ సింగ్ భవన్‌లో అల్లూరి చిత్రపటానికి సిపిఐ మండల సమితి కార్యదర్శి ఆర్ .శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్. శ్రీనివాస్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు వై.రాంబాబు, సుజాత నగర్ శాఖ కార్యదర్శి ఎన్ ఆసిరినాయుడు, హరీష్, రాజు , అప్పారావు, సూరిబాబు, వెంకటేష్, పైడిబాబు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ గుడి వద్ద గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు పూలమాల వేసి నివాళులర్పించారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముఠా కార్మికులు, మత్స్య కార్మిక సంఘం నాయకుడు కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : పార్క్ హోటల్ సమీపంలోని బీచ్ రోడ్డులో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి తెలుగు శక్తి అధ్యక్షుడు బివి.రామ్ పూలమాలవేసి నివాళులర్పించారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రం సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన బుధవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా, మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, సిఐటియు సీనియర్ నాయకులు వివిఎస్.పద్మనాభరాజు, అల్లూరి విజ్ఞాన కేంద్రానికి చెందిన జిఎస్.రాజేశ్వరరావు, బుజ్జి, సిహెచ్ సత్యనారాయణ, ఎంఆర్‌డి.రాజు, వై.సత్యనారాయణ పాల్గొన్నారు. సుమారు 500 మందికి మజ్జిగ పంపిణీచేశారు.

గొల్లలపాలెంలో వివిసిహెచ్ మెడి కవర్ హాస్పిటల్ సహకారంతో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సంతోష్‌కుమార్, మెడికల్ రిప్స్ రాష్ట్ర కార్యదర్శి కెవిపి చంద్రమౌళి, శేష తదితరులు పాల్గొన్నారు. 137 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిహెచ్.నర్సింగరావు తదితరులు